# సాయిపథంలో
# మన నిత్యప్రార్థన

ఇది భగవాన్ శ్రీరమణమహర్షి రచించిన "అరుణాచలపదికానికి శ్రీసాయిపరమైన స్వేచ్ఛానుసరణము, శ్రీభగవాన్ దివ్యాంతరంగము నుండి స్వేచ్ఛగా ప్రవహించిన యీ స్తోత్రము భక్తి జ్ఞాన వైరాగ్యాల త్రివేణి సంగమం. మహర్షిప్రోక్తమైన యీ ప్రార్థన మహిమాన్వితమైన వేదవాక్కే. ఇది మామూలు ప్రార్థనల వంటిది కాదు. ఇందులోని భావాన్ని హృదయగతం చేసికొని శ్రద్ధగా చదివే దీని ప్రభావమూ అసాధారణంగానే ఉంటుంది. శ్రీసాయిభక్తులకు శ్రీ సాయియే సకలదేవతాస్వరూపము, ఉపాసనాదైవము, సాయిభక్తులు ప్రతినిత్యం యీ ప్రార్థనను భావస్ఫూర్తితో చదవడం, వారి సాధనకెంతో దోహదం చేసి శ్రీసాయినాథుని అనుగ్రహానికి పాత్రులను చేయగలదు.

ఈ ప్రార్థనలో ప్రకటమైన మహోన్నతభావం సామాన్య భక్తునికుంటుందా, అది లేకుండా అనుకరణలా అలా ప్రార్థన చేయడం ఎంతవరకు సముచితం --- అనే సందేహం కొంతమందికి కలుగవచ్చు. నిజమే! అయితే, అట్టి ఉన్నతభావాలను మనకు చేతనయినంత ఆర్తి ఆర్ద్రతలతో తిరిగి తిరిగి తిరిగి మననం చేసుకోవడం ద్వారా, అట్టి భావము సంస్కారము క్రమంగా మనలోనూ హృదయగతమై, పై ప్రార్థన "సార్థకం" కాగలదు!

-- శ్రీసాయినాథుని శరత్ బాబూజీ

*ఓ సాయినాథా! ఏమి లాభం పొందుదామని సంసార సాగరంలో మునుగుతూ తేలుతూ నాశనమై పోతున్న అసంఖ్యాక జీవుల్లో ఎందుకూ ఎవరికీ కొరగాని యీ దీనుణ్ణి గురిచూచి పట్టుకొని ఉద్ధరించి నీ పాదాల దగ్గర నిలుపుకొన్నావు? ఓ కరుణాసముద్రుడా! నీ పేరెత్తటానికి కూడా అర్హత లేనివాణ్ణి అవధిలేని నీ కరుణను స్మరించి సిగ్గుతో కృంగిపోతున్నాను. బాబా! నన్ను దీవించు* (1)

*ఓ సాయినాథా! నీ ముఖమే ఎరుగని నన్ను ఒక్కసారిగా మింగివేయాలని తలచి నీ అనుగ్రహపాశంతో నా కంఠాన్ని బిగించి, బలవంతంగా నీ పాదాల వద్దకు యీడ్చుకొని వచ్చావు. మరి ఇదేమిటి? నన్ను ఒక్కసారిగా మింగివేయకుండా కొంచెం కొంచెంగా తింటున్నావేమిటి? ఇట్లా చావుబ్రతుకుల మధ్య చిత్రహింస చేయడం నీకు న్యాయమేనా? నేను గతజన్మల్లో ఎంత చేసానో? ఆ ఘోరమైన దురంతాన్ని ఈ దుర్బలుడు ఎదిరించగలడా?*

*ఓ సాయినాథా! ఒకటే నా ప్రార్థన. ఈ "నా" అహాన్ని ఈ క్షణాన్నే పూర్తిగా మింగివేయి. అప్పుడు "నేను" మృత్యువును అధిగమించి ఒక్కడినై చిరంజీవిగా వెలుగుతుంటాను* (2)

ఓ నా తండ్రీ! నేను చిరకాలం నుండి కమలం దగ్గర కప్పలాగ నీ పాదాల దగ్గర ఉన్నాను. తుమ్మెద మాదిరి నీ జ్ఞానమధువును ఆస్వాదించే భాగ్యాన్ని నాకు కలుగుచేయి. అట్లా అనుగ్రహించకపోయావా, నిన్నే వధ్యశిలగా చేసికొని అంతమై, శాశ్వతంగా నీ అపకీర్తి స్తంభంగా నిలుస్తాను. ఈ అపఖ్యాతి నుండి తప్పుకోడానికైనా నన్ను అనుగ్రహించు! ఓ సాయినాథా! నీ జ్ఞానకాంతులు సకలాన్నీ ప్రకాశింపచేస్తున్నాయి. గాలికంటే సూక్ష్మమైన నీ అనుగ్రహం అంతటా వ్యాపించి ఉంది. (3)

ఓ సాయినాథా! నేను ఈ ప్రపంచంలో సగర్వంగా తలెత్తి తిరక్కుండా నా బుద్ధిని (ప్రపంచజ్ఞానాన్ని) అపహరించి ఎందుకూ కొరగాని మొద్దును చేసి వదిలావు. పోనీ, నీ జ్ఞానాన్నన్నా యిచ్చావా అంటే అదీ లేదు. ఇట్లా రెంటికి కాకుండా చేసావు. ఈ స్థితి భరించరానిది. ఎవరి వినోదానికై ఇట్లా చేస్తున్నావు? నాకు ఈ ప్రపంచపు పిచ్చిని వదల్చి, నీ పాదాలు పట్టుకొనే పిచ్చిని అనుగ్రహించు. ఓ సాయినాథా! నీవు ప్రపంచోన్మాదానికి విరుగుడైన తిరుగులేని ఆత్మరూపంతో వున్న దివ్యౌషధానివి. (4)

ఓ సర్వోత్కృష్టుడా! "నీ పాదాలు పట్టుకుంటే సమస్త బంధాలు తెగిపోయి ముక్తులమౌతాం" అనే జ్ఞానం లేని అసంఖ్యాకుల్లో నేను అగ్రేశ్వరుణ్ణి. నేను కర్తను అని అహంకరిస్తున్న యీ అహాన్ని నీ అనుగ్రహజ్వాలలతో బుగ్గిచేయి. నా భారాన్ని స్వీకరించు. సమస్తాన్ని ధరిస్తూ భరిస్తున్న ఓ విశ్వగర్భుడా! నీకు వేరే భారమెక్కడిది? నీ నుండి విడివడి ప్రపంచభారాలను నెత్తిన పెట్టుకుని కృంగిపోతున్న నన్ను ఉద్ధరించు. ఓ కృపాస్వామీ! పరాత్పరా! బాబా! ఒక్కక్షణం ఆలస్యం లేకుండా నన్ను నీ పాదపద్మాల దగ్గరకు చేర్చుకో (5)

అద్వితీయుడవైన ఓ పరిశుద్ధుడా! పంచభూతాలు (ఆకాశం, గాలి, అగ్ని, నీరు, భూమి) అనంతమైన జీవకోటి, చరాచర సృష్టి నీవు తప్ప అన్యం కాదు. అయినప్పుడు నేను మాత్రం నీ కంటే భిన్నంగా ఎట్లా ఉండగలను? సకలజీవుల హృదయాలలో నీవు ఒక్కడివై నిండి వెలుగుతున్నావు. హృదయం నుండి "నేను" (మిథ్యానేను) అని తలెత్తుతున్న వీడెవడు? నీ కరుణతో వీడినెత్తిమీద నీ పాదాన్ని ఉంచి మూలం (హృదయం) లోనికి, అంటే నీ లోనికి త్రొక్కివేసి, పూర్ణంగా నీలో కలిపి వేసుకో! ఓ సాయినాథా! (6)

ఓ నాతండ్రీ! దొంగ మాదిరి నన్ను బలవంతంగా నీ భక్తిపాశంతో కట్టివేసి ఎంతోకాలం నుండి నీ పాదాల దగ్గర నిలబెట్టావు. మరి నీ అనుగ్రహంతో నన్ను శిక్షించవేమిటి? ఎందుకు నన్ను తీసుకొని వచ్చినట్లు? నీ తత్త్వమేమిటో నా కర్థం కావడం లేదు. నీ విరహాగ్ని నన్ను దహించి వేస్తోంది. విలవిల్లాడిపోతున్నాను. ఈ నా అవస్థ చూచి అందరు నీ వాక వట్టి రాతిబొమ్మవంటున్నారు. నేనెటూ చెప్పలేక మూగపోతున్నాను. తల వాలిపోతోంది. ఇట్లా నేను వలలో పడ్డ జింకలా నాశనం కావలసిందేనా? ఓ నా తండ్రీ! నన్ను నీలో కలుపుకో! నేను ఇది కావాలి, అది కావాలి అని అడుగదలచలేదు. బాబా! పోనీ నీ ఇచ్ఛయే నెరవేరుగాక! నిన్ను తెలుసుకోవడానికి నేనెంతటివాణ్ణి? నేనెవడను? నిన్ను తెలుసుకోగానే నేను పోయి నీవే నేనుగా అనుభూతమౌతున్నావు. (7)

సాధురూపంలో ఉన్న ఓ ప్రేమస్వరూపుడా! ఎవరికీ ఎందుకూ కొరగాని నన్ను అకారణ ప్రేమతో నీ వాణ్ణిగా చేసుకొన్నావు. ఇప్పుడు నీవు నిజస్వరూపంతో ప్రత్యక్షమై, నన్ను నీలో కలుపుకోకపోతే నేను ఇట్లా అంతం కావలసిందేనా? సూర్యదర్శనం లేకుండా పద్మం వికసిస్తుందా? ఓ సూర్య సూర్యుడా! నీ అనుగ్రహపు వెలుగును క్రుమ్మరించి ఈ దీనుణ్ణి ఉద్ధరించు. (8)

ఓ ప్రేమస్వరూపా! సాయినాథా! నీవెవరో కూడా ఎరుగని నన్ను కరుణతో వశపర్చుకొని ప్రేమలేని నా హృదయంలో నీ ప్రేమను రగిల్చి ఇప్పుడు వదిలివేశావు. నీవు నన్ను ప్రేమతో నింపి అక్కున చేర్చుకోవేమిటి? విరహాగ్ని నన్ను దహించి వేస్తోంది. మైనంలా కరిగిపోతున్నాను. ఇట్లా నీ ఈ బిడ్డ అంతం కావలసిందేనా? అటువంటప్పుడు నీ భక్తిని నాలో ఎందుకు మేల్కొల్పాలి? ఓ నా తండ్రీ, నేను నీ కోసం అంతం కావడమే నీకు వినోదమైతే అట్లాగే కానియ్యి! అదే నాకు పదివేలు ప్రేమనుండి వుద్భవిస్తున్న ఓ ఆనందమూర్తీ! భక్తుల హృదయాలలో పొంగుతున్న ఓ అమృతఝురీ! శరణార్థుల స్వర్గధామమా! నీ సంకల్పమే నెరవేరుగాక!! (9)

ఓ సమస్తజీవుల్లారా! నేనొక క్రొత్త దివ్య అయస్కాంతాన్ని కనుగొన్నాను. అదేమి అద్భుతమో దీన్ని ఒక్కసారి స్మరించారా - ఇది మనలను వలగొని సకలేంద్రియ చలనాన్ని ఆపి, తనకు అభిముఖంగా త్రిప్పి, లోపలికి (హృదయంలోకి) యీడ్చి, పక్వంచేసి మింగివేసి, తనమాదిరి మరో అయస్కాంతంగా మార్చివేస్తుంది. తస్మాత్ జాగ్రత్త! ఈ "జీవ"హంతకుడు ఎక్కడో లేడు, మన హృదయాలలోనే పొంచియున్నాడు. ఆయన ఎవరోకాదు. సద్గురు సాయినాథుడే (10)

నా మాదిరిగా ఎందరు నిన్ను "భగవంతుడు" అని భావించి పూర్ణాహుతైపోయారో! ఓ జీవభారవాహకుల్లారా! బ్రతుకు మీద రోసి ఆత్మహత్యకై తెగిస్తున్న నిరాశాజీవుల్లారా! మరణించడానికి అసాధారణమైన మందు మన చెంతనే వుంది. దీని శక్తి పరమాద్భుతం! దీనిని ఒక్కసారి స్మరిస్తే చాలు, మనలను చంపకుండానే చంపుతుంది. (చావు పుట్టుకులకు కారణమైన అహంకారం నశిస్తుంది) ఆ శక్తి మరేదో కాదు! సాక్షాత్తూ శ్రీ సాయినాథుడే! (11)